# సింగిల్ పేజీ కథలు

## మనసు తీర్పు!

"ఆధునీకరణ, కొత్త చట్టాల పర్యవసానం కొన్ని జీవితాలను చిన్నాభిన్నం చేయక తప్పదనిపించింది వాసుదేవరావుకి. కలెక్టర్ ద్వారా వచ్చిన సర్క్యులర్ అందుకొని ఆ కార్యక్రమాన్ని వెంటనే అమలుచేయాలని నిర్ణయించుకున్నాడు.

ఉదయం పది గంటలు దాటుతుండగా ఊరిమీద పడ్డారు లేబర్ ఆఫీసర్ వాసుదేవరావు, అసిస్టెంటు వెంకటపతి, ప్యూను వీరాస్వామి. వాళ్లు సరాసరి ఒక మెకానిక్ షెడ్డులోకి వెళ్లారు. వాళ్లకు అక్కడ రెడ్ హ్యాండెడ్‌గా పధ్నాలుగేళ్లలోపు పిల్లవాడు పనిచేస్తూ పట్టుబడ్డాడు. వాడ్ని పట్టుకొని ఆ షెడ్డు ఓనర్ మునాఫ్‌కు రెండు వేల రూపాయలు జరిమానా విధించారు.

పట్టుబడిన కుర్రవాడు దొంగతనం చేయలేదు, స్మగ్లింగు చేయలేదు, ఉగ్రవాది అసలే కాదు, వ్యభిచారులను తార్చే బ్రోకరేజీ చేయలేదు. ఐ.పి. పెట్టి డబ్బు పోగేసుకోనూలేదు. పొట్ట కూటి కోసం ఓ మెకానిక్ దగ్గర పనిలో కుదిరాడు. వాడి ఖర్మ కాలి, వాడికి పదమూడు సంవత్సరాలు. బాలకార్మిక చట్టం కింద దొరికిపోయాడు.

వాడి కళ్లల్లో నీళ్లు. రేపటి నుండి పని ఉండదు. ఇప్పటికిప్పుడు చదువుకోవాలనిపించడం లేదు. ఇంట్లో తాగుబోతు తండ్రి, కూలిపని చేసే తల్లి. ఇంకా ఇద్దరు చెల్లెళ్లు. తను సంపాదించే కాస్త డబ్బు ఆ చిన్న కుటుంబానికి కాస్తంత ఆదరువు.


మునాఫ్ మేస్త్రీకి కళ్లు తిరిగాయి. పదిహేనేళ్లలోపు పిల్లల్ని పనిలో పెట్టుకున్నందుకు ప్రభుత్వం రెండు వేలు పెనాల్టీ వేసి, మళ్లీ చేస్తే జైలుకు పంపిస్తామని బెదిరించి మరీ వెళ్లిపోయారు. ఉక్రోషం పట్టలేక లేబరు ఆఫీసర్‌ని, ప్రభుత్వాన్ని పిల్లగాడిని చెడతిట్టి, పిల్లగాడిని కొట్లించి పంపించివేశాడు. పిల్లవాడు బిక్కుబిక్కుమంటూ వెళ్లిపోయాడు.

లేబర్ ఆఫీసర్ వాసుదేవరావు చాలాచోట్ల చాలా మంది బాలకార్మికుల్ని పట్టుకుని బోలెడన్ని కేసులు బుక్ చేశాడు. ఒకోసారి తను చేస్తున్నది చాలా బాధాకరంగా ఉంటోంది. కొందరు పిల్లగాళ్లయితే దండాలు పెడుతూ ఏడుపులు ఆరంభించారు.

"బాలకార్మికుల్ని తిరిగి బ్రిడ్జి స్కూలుకి పంపి సక్రమంగా అన్ని సదుపాయాలూ కలుగజేసి, చదువులు చెప్పిస్తుందన్న" భరోసా ఏమీ లేదు. 'ఆరంభించేటప్పుడు ఉండే ఉత్సాహం అమలుజరిపేటప్పుడు ఉండదు' అనుకున్నాడు

రెండు రోజులు గడచిపోయాయి. తన ఇంట్లో పని చేసే పని పిల్ల చంద్రి రెండ్రోజులుగా రావడం లేదు. వాసుదేవరావు, భార్య "పనంతా చేయలేకపోతున్నాను. నాకసలే షుగరు. ఇంకో పిల్లను చూడండి.." అంటూ సతాయింపు మొదలుపెట్టింది.

పనిపిల్ల ఉండే ఏరియా వివరాలు తెలుసుకొని స్కూటర్ మీద చంద్రి ఉండే చిన్నగుడిసె దగ్గరకు



వెళ్లాడు. తడిక తట్టగానే చంద్రి వచ్చి తలుపు తీసి "అయ్యగారు! మీరా?" అంటూ ఆశ్చర్యపోయింది. వాసుదేవరావు గుడిసె లోపలకు వెళ్లాడు కుక్కిమంచం లేచి లేచిన బలహీనంగా ఉన్న చంద్రి తల్లి నమస్కరించి, చిన్న స్టూలు చూపించింది. దరిద్రం తాండవిస్తున్న ఆ గుడిసెని చూస్తూ కూర్చున్నాడు వాసుదేవరావు.

"తమరిలా వచ్చారేందయ్యా?" అడిగింది చంద్రి తల్లి.

"చంద్రి మా ఇంటికి పనికి రావడం లేదు" చెప్పాడు.

"పదిహేనేళ్ల లోపు పిల్లలు పనిచేయకూడదని, ప్రభుత్వం వాళ్లు పట్టుకుంటున్నారంటగదండి. మా పెద్దోడ్ని మెకానిక్ షెడ్డులో పట్టుకుని వెళ్లగొట్టారంట. ఆ దిగులుతో నాకు జ్వరం. మా చెంద్రికేమీ పన్నెండేళ్లయ్యా. అందుకే పంపించలేదు. చిన్న పిల్ల కూడా టీకొట్లోకి పోవడం లేదు. మా పెద్దోడు నిన్న ఉదయాన వెళ్లాడు. ఎటెళ్లిపోయాడో! వీళ్ల అయ్య పట్టించుకోడు. ఏ బ్రాందీ షాపు దగ్గర అడుక్కుంటున్నాడో!" చెబుతూ ఆయాసంతో రొప్పుతున్నది చెంద్రి తల్లి.

ఎముకల పోగుల ఉన్నా ఆ తల్లీ, పిల్లల్ని చూస్తుంటే మనసు చలించిపోయింది వాసుదేవరావుకి. ప్రత్యక్షంగా తన వృత్తి ధర్మాన్ని తాను సక్రమంగా చేసిన ముప్పావు భాగం దరిద్రనారాయణులున్న ఈ దేశంలో పరోక్షంగా చాలా కుటుంబాలు అతలాకుతలం అయిపోతున్నాయి.

"అమ్మా! ఇక నుండి చంద్రి బదులు నువ్వు మా ఇంటికి పనికిరా! మీ పిల్లల్ని చదివినంతవరకూ సర్కారు బడిలో చేర్పించి చదివిస్తాను. మీకు ఏదో సహాయం చేస్తుంటాను" అని లేస్తూ ఖర్చుల కోసం రెండు వందలు చంద్రి చేతిలో పెట్టి బైటికి వచ్చేశాడు వాసుదేవరావు.

**-పి.వి.రమణకుమార్** (చిలకలూరిపేట)

## అమ్మ

అమ్మ చనిపోయి నెల్రోజులు దాటింది. మా ఆవిడ, పిల్లలు... ఆవిడ లేని లోటును వారం రోజులకు అలవాటు చేసుకున్నారు. నాకు ఇప్పుడిప్పుడే అలవాటవుతోంది. కానీ.. నాన్నగారే.. రోజురోజుకీ ఇంకా దిగులు పడిపోతున్నారు. ఆయనకు ఎలా ధైర్యం చెప్పాలో అర్థం కావడం లేదు నాకు. పలకరిస్తే అమ్మ మాట వస్తుంది. అమ్మ కట్టుకున్న చీరెలు, బట్టలు, వస్తువులు.. ఆమె పడుకునే చోటు... వదలడం లేదు నాన్నగారు. భోజనం దగ్గర కూర్చుంటే గంటల తరబడి ముద్ద మింగకుండా అలా ఉండిపోతున్నారు. డాక్టర్ల నడుగుతే.. మానసిక వ్యధకి మందేదీ లేదన్నారు.

నాన్నగారి బాధ భరించలేక ఓ రోజు రాత్రి.. అలా శూన్యంలోకి చూస్తూ బాల్కనీలో కూర్చున్న నాన్నగారి ఎదురుగా కూర్చున్నా...

"నాన్నా!"

" "

"నాన్నా.. ఇలాగే ఉంటే ఎలా నాన్నా! అమ్మపోయిన దిగులు మాక్కూడా ఉంది. దానికి తోడు నీ బెంగ కూడా అయితే నేనెలా తట్టుకోగలను.. నువ్వే ఆలోచించు..."

నెమ్మదిగా నోరు విప్పారు నాన్న..

"ఒరేయ్.. మా అమ్మ నాకు జ్ఞానం రాకుండానే పోయింది. మీ అమ్మ.. మా పెళ్లయినప్పటి నుంచి భార్యగా పది పాళ్లుంటే.. నీకు తల్లిగా తొంభై పాళ్లుండేది.. పోయినది మీ అమ్మే కాదురా... నాక్కూడా అమ్మే"

ఆ పైన నాన్న మాట పెగల్లేదు..

**-యనమండ్ర రామకృష్ణ** (చెన్నై)